





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**


తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 239 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 20-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00




# భగ్గుమన్న బంగ్లాదేశ్



**తిరుగుబాటు నాయకుడు హాది మృతితో రెచ్చిపోయిన దుండగులు**

- దేశంలోని పలు చోట్ల విధ్వంసం
- హిందువును చంపిన అల్లరి మూక
- రెండు మీడియా సంస్థలకు నిప్పు
- జాగ్రత్తగా ఉండాలని స్థానిక భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ

ఢాకా, -

మన పొరుగు దేశం బంగ్లాదేశ్ మరోసారి భగ్గుమంది. ఇటీవల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి, తిరుగుబాటు నాయకుడు, భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు చేసే షరీఫ్ ఉస్మాన్ హాది (32) మరణించడంతో ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు గురు, శుక్రవారాల్లో దేశంలో పలుచోట్ల నిరసనలు చేపట్టడంతో హింస, విధ్వంసం చోటు చేసుకుంది. అల్లర్లలో ఒక హిందువు హత్యకు గురి కాగా, పలువురు నిరసనకారులు, పౌరులు గాయపడ్డారు. ఢాకాలో బంగ్లాదేశ్ వ్యవస్థాపక పితామహుడు షేక్ ముజిబుర్ రెహమాన్ గృహమైన 32 ధన్‌మండీ భవనాన్ని ఆందోళనకారులు కూల్చివేశారు. రాత్రి నిరసనకారులు రాజాషాహీలోని అవామీ లీగ్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. రెండు మీడియా సంస్థలకు నిప్పు పెట్టారు. జతియా ఛత్ర శక్తి విద్యార్థి సంఘం యూనివర్సిటీ క్యాంపస్‌లో సంతాప ప్రదర్శన చేసిన అనంతరం షాన్‌బాగ్ కూడలికి చేరుకుని ఆందోళనలో పాల్గొంది. చిట్టగాంగ్‌లోని భారత సహాయ ఇండియన్ హై కమిషనర్ నివాస గృహంపై రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వారిపై లాఠీచార్జి చేయడమే కాక, టియర్ గ్యాస్ ప్రయోగించారు. అలాగే రెండు పత్రికా కార్యాలయాలకు సిబ్బందిని నిర్బంధించారు. దీంతో బంగ్లాదేశ్‌లోని భారత హై కమిషన్ అడ్వైజరీ జారీ చేసింది. భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని కోరింది.

-మిగతా 2 లో





## ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

- సమస్యలపై వేగంగా స్పందించి..చర్యలు తీసుకోవాలి
- వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము

హైదరాబాద్,డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.నియామకాల్లో

-మిగతా 2 లో

## పంచాయితీలకు సెలవ్ పెట్టండి

**ఎంపీటీసీ,జడ్పీటీసీలకు ప్రిపేర్ కండి**

- గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు
- ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి
- గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్



రాజన్నసిరిసిల్ల,డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి..

-మిగతా 2 లో



## ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ


- ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి
- షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సులభంగా, సౌకర్యవంతంగా సినిమాల నిర్మాణానికి తెలంగాణ ఎంతో అనుకూలంగా మారిందన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు సహా పలువురు సినీ ప్రముఖులు, విశ్లేషకులతో కలిసి హైదరాబాద్

-మిగతా 2 లో

## అఫ్ఘానిస్థాన్‌ను వణికించిన భూకంపం..



- రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.1గా నమోదు
- మణిపూర్‌లోనూ ప్రకంపనలు

న్యూఢిల్లీ,-

అఫ్ఘానిస్థాన్ లో భూకంపం సంభవించింది. శుక్రవారం ఉదయం భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.1గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు తెలిపింది. అయితే, భూకంపం తీవ్రత స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. ఈ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.మరోవైపు ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లోనూ భూమి కంపించింది. ఉఖ్రుల్‌లో ఇవాళ తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి.

-మిగతా 2 లో



## ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

- 74శాతం ఫిర్యాదులు పరిష్కరించాం
- రెండేళ్ల ప్రజావాణి వార్షికోత్సవంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్,డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

: ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకోసం తామంతా అహరహం శ్రమిస్తున్నామని అన్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లల్లో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. బేగంపేట ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజావాణి 2వ వార్షికోత్సవానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

-మిగతా 2 లో



## ఎంపీలకు తేనీటి విందు ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లా..

- హాజరైన ప్రధాని మోదీ, ప్రియాంక గాంధీ, రాజ్‌నాథ్ సింగ్
- సరదాగా ముచ్చిటించుకున్న సభ్యులు
- ప్రధాని విదేశీ పర్యటనపై ప్రియాంక ఆరా

న్యూఢిల్లీ,

పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడువారాల పాటు వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనల మధ్య ముగిసాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో సభలోని వాతావరణాన్ని తేలిక చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ఉదయం ఎంపీలందరికీ తన నివాసంలో తేనేటి విందు ఇచ్చారు. గత సమావేశాల మాదిరిగా కాకుండా ఈ టీపార్టీకి విపక్ష ఎంపీలు కూడా హాజరయ్యారు. స్నేహపూర్వక వాతావరణంలో సరదా ముచ్చట్లతో సభ్యులంతా సందడిగా గడిపారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనలో ఉండటంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పీకర్ ఇచ్చిన టీపార్టీలో పాల్గొన్నారు. విపక్షం తరపున ప్రాతినిధ్యం వహించారు. 20 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఓం బిర్లా, మోదీతో పాటు రాజ్‌నాథ్ సింగ్ కూర్చుని ఉండగా ఆయన పక్కన ప్రియాంక ఆసీనులయ్యారు. తన నియోజకవర్గం వయనాడ్ నుంచి తెచ్చుకున్న ఒక మూలికను ఎలర్జీ రాకుండా తీసుకుంటూ ఉంటానని ప్రియాంక వివరించారట. మోదీ ఇటీవల జరిపిన

-మిగతా 2 లో

## గాడి తప్పుతున్న జర్నలిజం

- మీడియా పేరుతో బెదిరింపులా?
- కొద్దిమందితో మసకబారుతున్న నాలుగో స్థంభం!
- కొందరి వల్ల అందరికీ చెడ్డ పేరు




హైదరాబాద్, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):

జర్నలిజం అంటే ఒకప్పుడు ప్రజల నమ్మకం. ప్రజాస్వామ్యానికి రక్షణగా నిలిచే నాలుగో స్థంభం. అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం, బలహీనుల పక్షాన నిలిచే బాధ్యతుఇవే ఆ వ ృత్తికి గుర్తింపు. కానీ నేడు కొందరి అవాంఛనీయ చర్యలతో అదే జర్నలిజం పేరు ప్రశ్నార్థకంగా మారుతోంది.మీడియా అన్న పేరుతో బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. "మీ మీద న్యూస్ పెడతాం ఎక్స్‌పోజ్ చేస్తాం " అంటూ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, చిన్న దుకాణదారులను భయపెట్టి డబ్బులు వసూలు చేసే ఘటనలు సమాజాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. తప్పు ఉన్నా లేకపోయినా కెమెరా, మైక్‌ను ఆయుధాల్లా చూపించడయిఇది జర్నలిజం కాదని ప్రజలు గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.నిజమైన జర్నలిస్టు వ్యక్తిగత లాభం కోసం కాదుబీ ప్రజల ప్రయోజనం కోసం కలం పట్టుకుంటాడు.

-మిగతా 2 లో

## ఢిల్లీ పర్యటనలో బిజీగా సీఎం చంద్రబాబు

- పలువురు కేంద్రమంత్రులతో భేటీ
- పోలవరం నిధుల విడుదలకు పాటిల్‌కు వినతి
- ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని విన్నపం
- వివిధ పథకాలతో చేయూత ఇవ్వాలని నిర్మలమ్మకు వినతి
- దుగరాజపట్నంపై అనుమతులపై సోనోవాల్‌తో చర్చలు

2 లో



# భగ్గుమన్న బంగ్లాదేశ్

మొదటి తరువాయి

ఉస్మాన్ హాది మరణాన్ని బంగ్లాదేశ్ తాత్కాలిక అధ్యక్షుడు యూనిస్ గురువారం రాత్రి నిర్ధారించారు.

హిందువు సజీవ దహనం

మెమెన్సింగ్ జిల్లాలో ఒక హిందువును గురువారం రాత్రి కొందరు దుండగులు సజీవ దహనం చేశారు. భలుకా ఉపాజిలా పరిధిలోని దుబాలియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీపూ అనే వ్యక్తి ఓ ప్రవక్తను దూషించాడని ఆరోపిస్తూ దాడి చేసిన మూక అతడిని ఒక చెట్టుకు కట్టేసి చిత్ర హింస పెట్టి చంపింది. అనంతరం అతడి మృతదేహానికి నిప్పంటించారు.



# పంచాయితీలకు సెలవ్ పెట్టండి

మొదటి తరువాయి

పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లలెప్లలెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు



కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు. ప్రతిపైసా ప్రజల కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. ఐదు అంచెల్లో ప్రభుత్వాన్ని ఎలా నడపాలో అంబేద్కర్ రాజ్యాంగంలో చెప్పారని గుర్తుచేశారు. కేంద్రం పైసలు

ఇయ్యకున్నా.. రాష్ట్ర నిధులు ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని పేర్కొన్నారు. దాన్ని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని స్పష్టం చేశారు.

# ఢిల్లీ పర్యటనలో బిజీగా సీంచంద్రబాబు

- పలువురు కేంద్రమంత్రులతో భేటీ
- పోలవరం నిధుల విడుదలకు పాటిల్‌కు వినతి
- ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని విన్నపం
- వివిధ పథకాలతో చేయూత ఇవ్వాలని నిర్మలమ్మకు వినతి
- దుగరాజపట్నంపై అనుమతులపై సోనోవాల్‌తో చర్చలు



**న్యూఢిల్లీ,**
ఏపీ సీఎం చంద్రబాబుదిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. తొలుత కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమై పోలవరం సహా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై ఆయన చర్చించారు. ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత కీలక అంశమని.. రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలోఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టులపై కేంద్ర-రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ అమలు కోసం అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని సీఎం కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని.. దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం సమావేశమయ్యారు. పూర్వోదయ, సాస్కి పథకాల ద్వారా ఏపీకి చేయూత ఇవ్వాలని కోరారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు చేయూత అందించాలని కోరారు. సీఎం వెంట కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు ఉన్నారు. అనంతరం కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్, ఫిషింగ్ హార్బర్లకు కేంద్ర సాయంపై సోనోవాల్‌తో చర్చించారు. దేశంలో నౌకాశ్రయాలు, నౌకా నిర్మాణ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

మొదటి తరువాయి



ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్దిదారుల తమ అనుభవాల పంచుకున్నారు. అంకితభావంతో సేవలు అందించి.. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డి, దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.

# ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ

మొదటి తరువాయి

ప్రసాద్ ఐమ్యాక్స్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వెంకట్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ - 2025.. మన హైదరాబాద్‌కు, మన తెలంగాణకు ఒక మంచి ఆరంభం అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటేనే సినిమాగా పేరుగాంచింద న్నారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి సినిమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద సినిమాలు ఒకవైపు.. షార్ట్ ఫిల్మ్స్ మరోవైపు తీయడం వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు మరింత పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. కొత్త టాలెంట్ ఎక్కువగా షార్ట్ ఫిల్మ్స్ నుంచి వస్తోందన్నారు మంత్రి. షార్ట్ ఫిల్మ్స్ యువతకు ఫ్రీడమ్ ఇస్తాయని.. కొత్తగా ఆలోచించడానికి.. కొత్తగా ట్రై చేయడానికి.. తమ కథని తమ స్టైల్‌లో చెప్పడానికి.. అవకాశాన్ని కల్పిస్తాయన్నారు కోమటిరెడ్డి. ఈరోజు పెద్ద స్థాయిలో ఉన్న చాలామంది ఫిల్మ్ మేకర్స్ మొదట షార్ట్ ఫిల్మ్స్‌తోనే మొదలుపెట్టారని గుర్తు చేశారు మంత్రి. సినిమాటోగ్రఫీ మంత్రిగా తాను ఒక విషయం స్పష్టంగా చెప్తున్నానని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సినిమా రంగానికి పూర్తి మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారాయన. 'మంచి టాలెంట్‌కు అవకాశం రావాలి.. యువ ఫిల్మ్ మేకర్స్ ముందుకు రావాలి.. వాళ్లకు సరైన ప్లాట్‌ఫామ్ ఉండాలి.. అదే మా ప్రభుత్వ ఆలోచన.' అని ఉద్ఘాటించారు మంత్రి కోమటిరెడ్డి. తమ లక్ష్యం చాలా సింపుల్ అని.. దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలన్నారు. అనుమతులు ఈజీగా ఉండాలి. సదుపాయాలు బాగుండాలి. అందుకోసం ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తోంది. ఈ ఫెస్టివల్‌లో నాకు ప్రత్యేకంగా నచ్చిన విషయం ఒకటి ఉంది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫిల్మ్ మేకర్స్ పాల్గొనడం అని అన్నారు.

# అఫ్ఘానిస్థాన్‌ను వణికించిన భూకంపం..

మొదటి తరువాయి

రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 2.9గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూమికి సుమారు 35 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు పేర్కొంది.

# ఎంపీలకు తేనీటి విందు ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లా..

మొదటి తరువాయి

ఇథియోపియా, జోర్డాన్, ఒమన్ పర్యటన గురించి ప్రియాంక అడగగా, బాగా జరిగిందని ఆయన బదులిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత సుప్రియా సులే, సీపీఐ నేత డి.రాజా కూడా సమావేశం లో పాల్గొన్నారు. శీతాకాల సమావేశాలను మరికొద్ది రోజులు పొడిగించి ఉండాల్సిందని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడగా, ఆయనకు గొంతు నొప్పి రాకుండా ఇక్కడితో ముగించామని మోదీ సరదాగా బదులిచ్చారు. బాగా ప్రిపేర్ అయి సభకు వచ్చారంటూ ఎన్‌కే రామచంద్రన్ తదితర విపక్ష ఎంపీలను పీఎం అభినందించారు. పాత పార్లమెంటు భవనంలో మాదిరిగానే న్యూ పార్లమెంట్ బిల్డింగ్‌లో ఎంపీల కోసం ఒక సెంట్రల్ హాల్ చేర్చాలని పలువురు ఎంపీలు మోదీని కోరారు. సెంట్రల్ హాలులో ఎంపీలు, రిటైర్‌మెంట్ అయిన ఎంపీలు చర్చించుకునే వారు. దీనిపై మోదీ సరదాగా స్పందించారు. అది రిటైర్‌మెంట్ తర్వాత కదా...ఇంకా మీరు చాలా సేవ చేయాల్సి ఉంది.. అని అనడంతో సమావేశంలో నవ్వులు వెల్లివిరిసాయి. విపక్ష పార్టీ సభ్యులను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ గత పర్యాయం స్పీకర్ టీ పార్టీని రాహుల్, ఇతర విపక్ష నేతలు బాయ్‌కాట్ చేశారు. అయితే ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విపక్షాల విషయంలోనూ స్పీకర్ సముచితంగా వ్యవహరించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభిప్రాయ పడ్డారని, స్పీకర్ టీపార్టీకి విపక్ష ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలనే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో


మొదటి తరువాయి

అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మయూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. అంతకుముందు బొల్లారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ద్రౌపదీ ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క ఉన్నారు. దేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సదస్సు అనంతరం సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీలో వివిధ ప్రదేశాలను ద్రౌపదీ ముర్ము సందర్శించారు.

# గాడి తప్పుతున్న జర్నలిజం

మొదటి తరువాయి

కానీ నకిలీ ప్రెస్ కార్డులు, గుర్తింపు లేని వెబ్‌సైట్లు, పేరులేని యూట్యూబ్ ఛానళ్లతో తిరుగుతున్న కొందరు 'రిపోర్టర్'లు మొత్తం వృత్తినే అపకీర్తిపాలు చేస్తున్నారు. వారి చేష్టల వల్ల నిజాయితీగా పనిచేసే జర్నలిస్టుల ప్రతిష్టకు దెబ్బ తగులుతోంది. నైతిక జర్నలిజం స్పష్టంగా చెబుతోందివార్తలు నిజం ఆధారంగా ఉండాలి. బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వృత్తి ద్రోహం. వార్త పేరుతో డబ్బు డిమాండ్ చేయడం చట్టపరంగా ఎక్స్టార్షన్ నేరం. కోర్టులు, చట్ట అమలు సంస్థలు ఇప్పటికే ఇలాంటి చర్యలపై కఠిన హెచ్చరికలు జారీ చేస్తున్నాయి.ఈ పరిస్థితికి ఎదురుగా నిలబడాల్సిన బాధ్యత ముందుగా మీడియా




సంస్థలదే. కార్డులు పంచడమే కాదు, ప్రతినిధుల ప్రవర్తనపై కఠిన పర్యవేక్షణ ఉండాలి. నైతికత ఉల్లంఘించిన వారిని బహిరంగంగా దూరం పెట్టి స్పష్టమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వం కూడా ప్రెస్ పేరుతో జరుగుతున్న దౌర్జన్యాలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలి. నకిలీ మీడియా కార్డులు, ఫేక్ రిపోర్టర్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు వెరిఫికేషన్ సదుపాయాలు కల్పించాలి. నిజమైన జర్నలిజాన్ని కాపాడాలంటే, బ్లాక్‌మెయిల్‌కు జర్నలిజం అనే ముసుగు ధరించే వారిపై కఠిన వైఖరే మార్గం. సమాజం కోసం నిలిచిన నాలుగో స్థంభయసమాజానికే భయంగా మారకూడదు. కొద్దిమంది తప్పిదాల వల్ల మొత్తం జర్నలిజాన్ని అనుమానించకుండా, ఆ చెడు నీడలను తొలగించే ధైర్యం అవసరం. నిజాయితీతో పనిచేస్తున్న జర్నలిస్టులకు అండగా నిలబడితేనే జర్నలిజం మళ్లీ తన గౌరవాన్ని తిరిగి పొందగలదు.

# పంచాయతీ ఎన్నికల్లో ముందువరుసలో




**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎవరికీ అసౌకర్యం కలగకుండా అత్యంత సమర్థవంతంగా పూర్తి చేసినందుకు కరీంనగర్ జిల్లా ముందువరుసలో నిలిచింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఐఏఎస్‌కు టీఎన్జీవోల సంఘం, టీజీవోల సంఘం తరపున పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే ముందుగానే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడంలో జిల్లా యంత్రాంగం చూపిన సమన్వయం ప్రశంసనీయమని టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, టీజీవోల జిల్లా అధ్యక్షుడు, జేఏసీ కన్వీనర్ మడిపెల్లి కాళీ చరణ్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజలకు, ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సంగం లక్ష్మణరావు, అరవింద్ రెడ్డి, గడ్డం సుధాకర్, ముప్పిడి కిరణ్ కుమార్, ఒంటెల రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ అరవింద్ సింగ్, అభినవ రెడ్డి, మహేందర్ రెడ్డి, అలాగే నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు కోటా రామస్వామి, శంకర్ శ్రీనివాస్ తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సర్పంచులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్





**హుస్నాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపర్చగా గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ ఘనంగా సన్మానించారు. గురువారం సాయంత్రం హనుమకొండలోని ఆయన నివాసానికి వచ్చిన సర్పంచులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్, నాగారం సర్పంచ్ విజ్జగిరి సంపత్, పొట్లపల్లి సర్పంచ్ రాచపల్లి శ్రీనివాసులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ, కొత్తగా గెలిచిన సర్పంచులు గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులను సమర్థవంతంగా వినియోగించి, గ్రామస్తుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు అభ్యర్థులను బెదిరింపులకు గురిచేసి తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడవద్దని, బీఆర్ఎస్ పార్టీతో పాటు పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లపై డిమాండ్



**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల మొండి వైఖరిని వీడి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు అమలు చేసి చట్టబద్ధత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. కరీంనగర్ రాంనగర్‌లో బీసీ యువజన సంఘం అధ్యక్షుడు మదాసు సంజీవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో అసెంబ్లీలో అన్ని పార్టీలు బీసీ బిల్లుకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవంగా ఆమోదించాయని గుర్తుచేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం బీసీలకు నమ్మకద్రోహమని అన్నారు. ప్రభుత్వం జిఓ 9 తీసుకువచ్చి గవర్నర్, రాష్ట్రపతికి పంపి, తర్వాత దానిని రద్దు చేసి జిఓ 46 ద్వారా ఎన్నికలు నిర్వహించడం బీసీల హక్కులను దెబ్బతీసే చర్య అని ఆయన విమర్శించారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడంలో ఎలాంటి అడ్డంకులు లేవని, కానీ బీసీలకు మాత్రం సుప్రీంకోర్టు నిబంధనలను అడ్డుగా చూపడం శోచనీయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రయత్నించడం బీసీల పట్ల అన్యాయం అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంతెన కిరణ్, మంద వెంకన్న, జిల్లా కార్యదర్శి దుంపట మురళీ, ప్రచార కార్యదర్శులు గుడిసెల రమేష్ గౌడ్, వంగల రవి గోపాల్, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరకొండ దీపక్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి కుసుంబ ఆదర్శ, సాయితేజ, శివ తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక అవసరం



**మహబూబాబాద్, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ వరదలు, పరిశ్రమ ప్రమాదాల నియంత్రణపై ఎన్‌డిఎంఏ ఆధ్వర్యంలో జరిగిన వీడియో కానాఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, జిల్లాల్లో విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్‌లు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయని, ప్రజలకు సకాలంలో సహాయం, పునరావాసం, పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. పరిశ్రమ ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పష్టమైన మార్గదర్శకాలు, ప్రతి పరిశ్రమలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ వరదల అంచనాలు, ముందస్తు హెచ్చరికలు, కంట్రోల్ రూమ్‌లు, పునరావాస కేంద్రాలు, లోతట్టు ప్రాంతాల శాశ్వత పరిష్కారానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్పీ తిరుపతి రావు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి, ఆర్.అండ్ బి ఈఈ భీములా నాయక్, సిపిఓ అశోక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జానపద సాంస్కృతిక జాతర

**హుస్నాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఈనెల 21న హుస్నాబాద్‌లో సిద్దిపేట జిల్లా స్థాయి జానపద సాంస్కృతిక జాతర నిర్వహించనున్నట్లు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖతో కలిసి ఈ జాతరను నిర్వహిస్తున్నామని, కళాకారులు, మహిళా కోలాటం బృందాలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతరించిపోతున్న జానపద కళలకు అడ్డుకట్ట వేయడం, కనుమరుగవుతున్న పల్లె వాతావరణం, సహజ జీవనశైలికి వెలుగు కిరణం చూపడం ఈ జాతర ప్రధాన ఉద్దేశమని సుభాష్ తెలిపారు. చతశ్షష్టి కళల్లో వృత్తి కళలు కూడా భాగమని, వాటిని వృత్తిగా మలచుకొని జీవనం సాగిస్తున్న జాతుల కళా ప్రతిభను ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ మహా జాతరలో అశేష అనుభవం, కళా నైపుణ్యాన్ని ప్రదర్శించే ప్రతి ఒక్కరికి ఆహ్వానం అందజేస్తూ, భావితరాలకు ఈ కళలను సంరక్షించి అందించడమే సంకల్ప స్వచ్ఛంద సేవా ఆశయమని ఆయన స్పష్టం చేశారు. సమాచారం కోసం 9440988001 నంబర్‌ను సంప్రదించవచ్చని వలస సుభాష్ తెలిపారు.

# పెదకల్వాల, సబితం గ్రామ సర్పంచుల సన్మానం



**పెద్దపల్లి, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: పెద్దపల్లి మండలంలోని పెదకల్వాల, సబితం గ్రామాలకు నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ సర్పంచులు, వార్డ్ సభ్యులు మాజీ శాసనసభ్యుడు దాసరి మనోహర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెదకల్వాల గ్రామ సర్పంచ్ పోల్ రాజు కనకమ్మ, సబితం ఉప సర్పంచ్ మహేందర్, దాసరి మనోహర్ రెడ్డిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో సర్పంచులు నిబద్ధతతో పని చేయాలని, బిఆర్ఎస్ పార్టీ విధానాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సలేంద్ర రాములు, అంజయ్య, అజయ్, రావి, లింగయ్య, శ్రీనివాస్, సాయి తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


# రాంపూర్‌లో అసంపూర్తి రోడ్డు సమస్య



**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరిఎక్స్‌ప్రెస్)**

రాంపూర్ 10వ డివిజన్, పాత 11వ డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్డులో దీపక్ టైలర్ వద్ద చాలా రోజులుగా అసంపూర్తిగా వదిలిపెట్టిన సిసి రోడ్డు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు సరిగా లేకపోవడంతో పలువురు కిందపడి గాయాలపాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన తర్వాత తాత్కాలిక పరిష్కారంగా గ్రావెల్ పోయించి మరమ్మతులు చేయించానని మాజీ కార్పొరేటర్ కోడూరి రవీందర్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రజల భద్రత కోసం రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# బీజేపీ సమ్మేళనం



**సంగారెడ్డి, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచి గెలిచిన సర్పంచులు, వార్డ్ సభ్యులతో రేపు జిల్లా కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా అధ్యక్షులు, సీనియర్ నాయకులు పోటీదారులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన



**హుస్నాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏయిఓ) శ్రీలత రైతులకు యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు.రైతులు తమ ఫోన్ నెంబర్, పట్టాదారు పాస్‌బుక్ నెంబర్, సాగు విస్తీర్ణం, వేసిన పంట వివరాలను నమోదు చేయడం ద్వారా యూరియా బస్తాలను ఎకరాల వారీగా, పంట ఆధారంగా, విడతల వారీగా పొందవచ్చని ఆమె వివరించారు. బుకింగ్ కేవలం 24 గంటలపాటు మాత్రమే యాక్టివ్‌గా ఉంటుందని, ఆ సమయంలో వినియోగించకపోతే స్టాక్ తిరిగి సిస్టమ్‌లో విడుదల అవుతుందని తెలిపారు. ఈ విధానం వల్ల రైతులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా సమయాన్ని ఆదా చేసుకోవచ్చని శ్రీలత పేర్కొన్నారు. రైతులకు ఈ యాప్ ఎంతో ఉపయోగకరమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ బొమ్మ శ్రీశైలం, బొమ్మ కొమురయ్య, యాదగిరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో శుక్రవారం సభ కార్యక్రమం

**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ అర్బన్ మండలంలోని సంతోష్ నగర్ సెక్టార్, కాశ్మీర్ గడ్డ 1వ అంగన్వాడీ కేంద్రంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సీడీపీఓ సబిత మాట్లాడుతూ, మహిళలు తమ సమస్యలను శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని, ప్రతి గర్భిణీ, బాలింత తప్పక హాజరుకావాలని సూచించారు. సభలో పలు అంశాలు చర్చించడం ద్వారా మహిళల్లో మానసిక ఉత్తేజం కలుగుతుందని తెలిపారు.హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సభకు హాజరుకావడం వల్ల సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారం అవుతాయని ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతో పాటు పిల్లల సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి కేంద్రంలో "షుగర్ బోర్డు" ఏర్పాటు చేసి, ఆహారంలో అధిక చక్కెర వాడకం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.మెడికల్ ఆఫీసర్ సఫిర్ హుస్సేన్ మాట్లాడుతూ, ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, వీటిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ సబిత, ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వప్న, బీసీ సతీష్, మెడికల్ ఆఫీసర్ సఫిర్ హుస్సేన్, ఎయిసేపీఎల్ స్వప్న, సీ హెచ్ ఎల్ సంపత్, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎస్‌లో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** డిసెంబర్ నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయికి సంబంధించి జడ్పీహెచ్ఎస్ దుర్శేడు వద్ద నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకాడే, ఐఏఎస్, ఎసిఎల్‌బి & డిఇఓ కరీంనగర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్, మిడ్‌లైన్ ఫలితాలపై సమీక్ష జరిగింది. ఎండ్లైన్ పరీక్షలో 90% కంటే ఎక్కువ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో కృషి చేయాలని ఆదేశించారు.మూడో తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమం ఎఫ్ఎల్ఎస్ పరీక్షలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల రీడింగ్, రైటింగ్ నైపుణ్యాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుర్శేడును సందర్శించిన సందర్భంగా పీఎంఎస్ఆర్ఐ ఇంటర్వెన్షన్స్, ఏటీఎల్, ఖాన్ అకాడమీ వంటి అంశాలపై ఉపాధ్యాయులను ప్రశ్నించి, తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ కర్ర అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి వాసవి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఆర్పీలు, ఉపాధ్యాయులు, సిఆర్పీలు పాల్గొన్నారు.

# జాగృతిలో భారీగా చేరికలు



**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** శంకరపట్నం మండలంలో జాగృతి సీనియర్ నాయకురాలు ఎండి సల్మా ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు చింతిరెడ్డి జైపాల్ రెడ్డి, సోహెల్, విష్ణువర్ధన్, మహిళా నాయకురాలు సానియా, నాజీయా, అజీత్ సోని లతో పాటు 50 మంది మహిళలు తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ జాగృతి కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, జాగృతిని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేస్తామని, 2029 వరకు తెలంగాణ రాష్ట్రానికి నాయకత్వం వహించే విధంగా జాగృతిని అన్ని విధాలుగా బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, కవితక్క నాయకత్వంలో జాగృతి మాత్రమే గత రెండు సంవత్సరాలుగా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం జాగృతి ద్వారానే సాధ్యమని, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, యువకులు కవితక్క వైపు ఆశతో ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శంకరపట్నం మండలంలోని కలువల ప్రాజెక్టు పునర్నిర్మాణం జరిగేంత వరకు జాగృతి పోరాటం చేస్తుందని హరిప్రసాద్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాగృతి ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, మండల ఇంచార్జ్ చంటి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, గాలిపల్లి రత్నాకర్ చారి, జంగ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం





**మిర్యాలగూడ, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ శివారులో గల మున్సిపల్ డంపింగ్ యార్డు గత కొన్ని సంవత్సరాలుగా చెత్త పేరుకుపోయి, దాని వలన పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముందడుగు వేశారు.డంపింగ్ యార్డులోని చెత్తను రీసైకిల్ చేసి పూర్తిగా తొలగించేందుకు ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపి, వారితో కలిసి యార్డును సందర్శించారు. చెత్త తొలగింపు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, పట్టణ ప్రజలకు మరియు పరిసర గ్రామాల వారికి డంపింగ్ యార్డు సమస్య ఇకపై శాశ్వతంగా తొలగిపోతుందని ఆయన స్పష్టం చేశారు.

# విద్యార్థుల దంత పరీక్షలు




**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దంత సమస్యలతో బాధపడకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి పరీక్షలు చేయాలని సూచించారు.కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మంకమ్మ తోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్యులు దంత చికిత్స నిర్వహించగా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఇప్పటి వరకు 12 వేల మంది విద్యార్థులకు పరీక్షలు జరగగా, వారిలో 1500 మందికి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 23లోపు మొదటి విడత పూర్తిచేయాలని, జనవరి 1 నుంచి రెండో విడత ప్రారంభించాలని ఆమె ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉచిత దంత వైద్య శిబిరాలను పకడ్బంధిగా నిర్వహిస్తున్న వైద్యులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీనా, వైద్యులు రవి ప్రవీణ్, రణధీర్, రాజిరెడ్డి, మంగ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అప్రమత్తతతోనే నష్టాన్ని నివారించవచ్చు




**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను ముందస్తు అప్రమత్తత ద్వారానే తగ్గించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లో జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పరిస్థితులను ముందుగానే అంచనా వేయగలిగితే ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించగలమని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని, ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించాలని సూచించారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి వివరాలను ప్రజలకు చేరవేయాలని అన్నారు. అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా సేవలు అందుబాటులో ఉండాలని, పారిశుధ్యం, వైద్య సేవలు కీలకమని పేర్కొన్నారు. ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ సహకారం అందిస్తుందని, అవసరమైతే హెలికాప్టర్ సేవలు వినియోగించవచ్చని తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విపత్తుల సమయంలో తక్షణ స్పందన అవసరం






**మంచిర్యాల, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజారక్షణ చర్యలు చేపట్టేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్ అన్నారు.హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, నీటిపారుదల, పోలీస్, వ్యవసాయ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో రక్షణ చర్యల ప్రణాళికపై సమీక్ష చేశారు.ఈ సందర్భంగా సుధీర్ బాల్ మాట్లాడుతూ, జాతీయ-రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థలు సంయుక్తంగా అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించినప్పుడు ఆర్మీ సిబ్బంది వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు ముందుగానే హెచ్చరికలు జారీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకోవాలని తెలిపారు.సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డేటాబేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ద్వారా వివరాలు సేకరించి రక్షణ చర్యల ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో కనీసం 10 రోజులు ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖలు తమ పరిధిలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు.చెన్నూర్ తహసిల్దార్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మంచిర్యాల, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి వివేకానంద తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ కమ్యూనిటీ భవన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, డీఎంఎఫ్‌టి నిధులతో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని మరింత విస్తరించేందుకు మరో 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. భీమారం, జైపూర్, చెన్నూర్ మండలాల్లో నేతకాని, జగ్జీవన్ రామ్, ముదిరాజ్ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని, చెన్నూర్‌లో 15 కోట్లతో సిసి రోడ్లు, మురుగు కాలువలు నిర్మించామని, త్వరలో 70-80 కోట్ల




రూపాయలతో మరిన్ని పనులు చేపడతామని తెలిపారు. అమృత్ పథకం ద్వారా త్రాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందిస్తున్నామని చెప్పారు. చెన్నూర్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం మేలో పూర్తవుతుందని, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామని తెలిపారు. 9.55 కోట్ల రూపాయలతో సమీకృత కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించి, ప్రజలకు ఒకే చోట కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ భవనాన్ని ప్రజలు బహుళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చని, సమీకృత మార్కెట్‌లో వీధి వ్యాపారులకు వేదిక కల్పించామని, అమృత్ పథకంలో పైప్‌లైన్లు, నీటి ట్యాంకులు నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలి


**చొప్పదండి, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అద్భుతమైన వైద్య సేవలను అందిస్తున్నాయని, ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ వైద్యశాలలను ఆశ్రయించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గుమ్లాపూర్ ఆరోగ్య కేంద్రంలో ప్రసవించిన రాగంపేట గ్రామ వార్డు సభ్యురాలు, యువ న్యాయవాది గసికంటి సోనియాను ఆయన సందర్శించి అభినందించారు. ప్రభుత్వ వైద్యంపై భరోసా ఉంచి ఇక్కడ ప్రసవం జరపడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకుంటూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతున్నారని, అదే బాటలో విద్యావంతులు, యువత సామాన్యులను ప్రోత్సహించాలని ఆయన అన్నారు. గత ఆరేళ్లలో చొప్పదండి, కరీంనగర్, హుజురాబాద్ సహా జిల్లాలోని ఆసుపత్రులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సి ఎస్ ఆర్ నిధులతో 15 కోట్ల




విలువైన పరికరాలు, అంబులెన్సులు, బెడ్లు అందజేశారని, కేంద్ర పథకాల ద్వారా కోట్లాది రూపాయలు జిల్లా ఆరోగ్యశాఖకు రావడం ఆనందకరమని తెలిపారు. పరిశ్రమలు, దాతలు కూడా ఇదే బాటలో సహాయం చేయాలని ఆయన కోరారు. తరువాత గుమ్లాపూర్ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. 24 గంటల పాటు గైనకాలజిస్టులు, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉందని, ఎలాంటి సంకోచం లేకుండా ప్రజలు ఆసుపత్రులను ఆశ్రయించాలని వైద్యురాలు అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, నాయకులు రాపల్లి శ్రీనివాస్, గుండె వెంకటేష్, ఉడుత రాము, గసికంటి విశేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేషన్ బరిలో సుధాకర్ పటేల్



**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24వ డివిజన్ పాత (40) నుండి పోటీకి సిద్ధమవుతున్న సుధాకర్ పటేల్ గత రెండు సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. గత పాలకులు డివిజన్‌ను విస్మరించారని, వర్షాకాలంలో రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నా, ఎండాకాలంలో నీటి సమస్యలు, వీధి లైట్లు, రేషన్ కార్డులు, పింఛన్ సమస్యలు ఉన్నా పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఈసారి ప్రజలు తనను ఆశీర్వదిస్తే కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ ఆశీస్సులతో డివిజన్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తానని సుధాకర్ పటేల్ తెలిపారు. యువకుడిగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి, కరీంనగర్ పట్టణంలో డివిజన్‌ను అగ్రస్థానంలో నిలబెట్టే సంకల్పం తనదేనని ఆయన పేర్కొన్నారు.

# శాతవాహనలో హ్యాండ్‌బాల్ సెలక్షన్స్

**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




శాతవాహన విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ హ్యాండ్‌బాల్ ఎంపికలు జరిగాయి. మార్చి 17 నుంచి 21 వరకు వి ఐ టి, వెల్లూరు లో పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునావర్ మాట్లాడుతూ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలు ప్రతిష్టాత్మకమైనవని, విద్యార్థులు కృషి చేసి విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. కృష్ణకుమార్, పి.డి విజయకుమార్, డా. మనోజ్ కుమార్, హ్యాండ్‌బాల్ కోచ్‌లు వెంకటేష్, శ్రీనాథ్, అమరేందర్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి



**వరంగల్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మొంథ తుఫాన్ వరదలతో నష్టపోయిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పోతన నగర్ ప్రాంతాన్ని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి, ఇచ్చిన మాట ప్రకారం బాధిత కుటుంబాలకు ఒక్కొక్కటికి 15,000 నష్టపరిహారం అందజేశారు. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కావడంతో స్థానిక మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు ఎం.డి. సమద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గతంలో వరదలు వచ్చినప్పటికీ బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయలేదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లోనే తుఫాన్ బాధితులకు రేషన్ సరుకుతో పాటు నష్టపరిహారం అందించిందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి-సురేందర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గన్నారపు సంగీత్ కుమార్, సీనియర్ నాయకులు గోల్కొండ సాంబయ్య, సిలువేరు కోటేశ్వర్, పులుగం సదానందం, గన్నారపు కమల్, లంక సతీష్, గడ్డం రమేష్, రుద్ర మహేష్, అడుప అరుణ్, బొల్లం పవన్, పులుమాటి అశోక్, గజ్జి రాజు, ఇసంపెల్లి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తీరంలో గస్తీకి వేగం.. అమూల్య

**న్యూఢిల్లీ -డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తీర ప్రాంతం వెంబడి సముద్రంపై రెస్క్యూ, నిఘాను చేపట్టడంలో 'వేగవంతమైన పెట్రోలింగ్ నౌక' (ఎఫ్‌పీవీ)ల పాత్ర అత్యంత కీలకం. ఈ కేటగిరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఎఫ్‌పీవీ నౌక 'అమూల్య' శుక్రవారం గోవాలో జల ప్రవేశం చేసింది. భారత్ నిర్మిస్తున్న 'ఆదమ్య' తరహా నౌకల్లో కొత్త తరానికి చెందిన 'అమూల్య'ను రక్షణ శాఖ అధికారులు జాతికి అంకితం చేశారు. కోస్ట్‌గార్డ్ అధికారులు దీనిని భారత తూర్పు తీరంలో భద్రతా చర్యల్లో మోహరిస్తారు. తీరం వెంబడి రక్షణ, భద్రతా కార్యకలాపాలు చేపట్టడం, దేశ ప్రయోజనాలను కాపాడటంలో 51మీటర్ల పొడవైన 'అమూల్య' కీలకపాత్ర పోషిస్తుందని ఇండియన్ కోస్ట్‌గార్డ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

# అయ్యప్ప స్వామి పాదయాత్ర విజయవంతం





**నిజామాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శబరిమలై అయ్యప్ప స్వామి పాదయాత్ర నవంబర్ 1 నుంచి డిసెంబర్ 14 వరకు 44 రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ పవిత్ర యాత్రలో అయ్యప్ప స్వామి దర్శనం సంపూర్ణంగా జరిగి భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. నందకిషోర్, జగదీష్, రాజేందర్, వసంత్ రాజ్ గురుస్వాముల ఆధ్వర్యంలో 10మంది అయ్యప్ప స్వాములు నియమనిష్ఠలు పాటిస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర ముగిసిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గురుస్వాములను శాలువాలతో సత్కరించి, భక్తుల నియమ దీక్ష, భక్తి నిబద్ధతను అభినందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, స్థానిక నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. పాదయాత్ర భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించి, సమాజానికి సద్భావన సందేశాన్ని అందించిందని పాల్గొన్నవారు తెలిపారు.

# బీజేపీ సర్పంచుల సన్మానం



**హుజురాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుజురాబాద్ నియోజకవర్గంలో గెలిచిన సర్పంచులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్‌రావు శుక్రవారం అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం అందిస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని ప్రజలు విశ్వసించడంతో బీజేపీ అభ్యర్థులు వరుసగా మూడు విడతల్లో ఘన విజయం సాధించారని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి కట్టుబడి ఉందని, గత పది సంవత్సరాల్లో చేపట్టిన కార్యక్రమాలతో గ్రామాల ముఖచిత్రం మారిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని విమర్శిస్తూ, పంచాయతీలను నిర్వీర్యం చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమని, ఆ దిశగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంకల్పంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సర్పంచులు రాగం శ్రీనివాస్, వలిగే కళ్యాణి, ఉప్పు మహేష్, దాట్ల వీరస్వామి, బైరెడ్డి వెంకటరమణారెడ్డి, ముషం సంగీత, మంతెన సుమలత, ఉప సర్పంచులు దొంతర వీణ రమేష్ యాదవ్, లింగమూర్తి, చెట్ల అనిత, పూరీల కుమార్, వార్డు సభ్యులు మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# గోపాల్‌రావుపేట హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

**రామడుగు, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



జడ్పిహెచ్ఎస్ గోపాల్‌రావుపేటలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీపై ఉపాధ్యాయులు చర్చించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఫిబ్రవరిలో జరగనున్న ఎఫ్ఎల్ఎస్ పరీక్షలకు ముందుగా మాక్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. మండల విద్యాధికారి రంగనాథ శర్మ మూడో తరగతి విద్యార్థులను ఇంగ్లీష్, గణితంలో ప్రత్యేకంగా సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో ఆర్పీలు విజయేందర్ రెడ్డి, ఆంజనేయులు, ముజీబ్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, చాడ శ్రీనివాసరెడ్డి, పిన్నింటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో బీజేపీ సర్పంచుల సన్మానం



**హుజురాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ నియోజకవర్గంలో గెలిచిన సర్పంచులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్‌రావు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం అందిస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని ప్రజలు విశ్వసించడంతో బీజేపీ అభ్యర్థులు వరుసగా మూడు విడతల్లో ఘన విజయం సాధించారని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి కట్టుబడి ఉందని, గత పది సంవత్సరాల్లో చేపట్టిన కార్యక్రమాలతో గ్రామాల ముఖచిత్రం మారిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని విమర్శిస్తూ, పంచాయతీలను నిర్వీర్యం చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమని, ఆ దిశగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంకల్పంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సర్పంచులు రాగం శ్రీనివాస్, వలిగే కళ్యాణి, ఉప్పు మహేష్, దాట్ల వీరస్వామి, బైరెడ్డి వెంకటరమణారెడ్డి, ముషం సంగీత, మంతెన సుమలత, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తిరుమల్ నగర్‌లోని శ్రీ నిలయంలో మయూరగిరి పీఠాధిపతి నములకొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గోదాదేవి ప్రసాదించిన ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రజలకు తెలియజేస్తూ ఈ వ్రతాన్ని ఆచరించిన వారికి సుఖసంపదలు, సౌభాగ్యాలు, మనశ్శాంతి కలుగుతాయని ఆయన పేర్కొన్నారు. పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, భజనల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రతిరోజు సాయంత్రం 5:30 నుంచి 6:30 వరకు సహస్రనామ పారాయణం, తిరుప్పావై వైభవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

# చెన్నూరులో సర్పంచుల సన్మానం



**మంచిర్యాల, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చెన్నూరు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన సర్పంచులతో కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను మంత్రి శాలువాలు కప్పి సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మైనంపల్లి గ్రామ సర్పంచిగా ఎన్నికైన కొర్ర రాంసింగ్ నాయక్

**దేవరకొండ, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామ సర్పంచిగా యువజన కాంగ్రెస్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్మెల్యే బాలునాయక్ ప్రదాన అనుచరుడు కొర్ర రాంసింగ్ నాయక్ తన సమీప అభ్యర్థి దేవి పై 37 ఓట్ల మెజారిటీ తో గెలుపొందారు. యువజన కాంగ్రెస్ లో చురుకైన పాత్ర పోషించిన రాంసింగ్. అనేక పోరాటాలు చేశారు. ఎమ్మెల్యే బాలునాయక్ ప్రధాన అనుచరుడిగా ఉన్నారు.



# మెడికల్ & సేల్స్ రిప్రెజెంటేటివ్స్ ధర్నా

**కరీంనగర్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యు) కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ముందు వందలాది మంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చీకోటి శ్రీధర్ మాట్లాడుతూ కొత్త కార్మిక చట్టాలు కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, యూనియన్ ఏర్పాటు హక్కు, సమ్మె హక్కు వంటి ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. ప్రత్యేకంగా మెడికల్ & సేల్స్ రిప్రెజెంటేటివ్స్ కోసం అమలులో ఉన్న ఎస్పీఈ



యాక్ట్ 1976 రద్దు చేయడంతో కనీస వేతన చట్టం, బోనస్, గ్రాట్యుటీ వంటి హక్కులు ప్రశ్నార్థకంగా మారాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎస్పీఈ యాక్ట్‌ను యథావిధిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిన్న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద కూడా వేలాది మంది పాల్గొని ధర్నా నిర్వహించినట్లు గుర్తుచేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ మెడికల్ & సేల్స్ రిప్రెజెంటేటివ్స్ న్యాయబద్ధమైన డిమాండ్లకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జి. విద్యాసాగర్, ఏ. సదానంద చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. అంజయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే. వెంకటేశ్వర్లు, పి. హరీష్, ఉపాధ్యక్షులు ఏ. బాలకిషన్, సహాయ కార్యదర్శులు పి. నరేందర్, కే. మదన్ మోహన చారి, కోశాధికారి కే. సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయ భూములపై ఆర్టీఐ దరఖాస్తు



**షాద్‌నగర్, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఫరూక్‌నగర్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూములపై ఆర్టీఐ చట్టం ప్రకారం సమాచారం కోరుతూ దరఖాస్తు సమర్పించబడింది. ఆలయానికి మొదటి నుండి దేవాదాయ శాఖ పరిధిలో ఎన్ని ఎకరాల భూమి ఉందో, ఇప్పటివరకు ఏమైనా కబ్జాకు గురైందా? కబ్జాకు గురై ఉంటే ఎన్ని ఎకరాలు కబ్జా అయ్యాయో తెలుసుకోవాలని కోరారు. అలాగే 2010 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఆలయానికి వచ్చిన విరాళాలు, వెండి ఆభరణాలు, ఆలయ అభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధుల వివరాలు కూడా వెల్లడించాలని కోరుతూ షాద్‌నగర్‌కు చెందిన మిద్దెల సత్యనారాయణ ఆలయ ఈఓకు ఆర్టీఐ దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తు ఆధారంగా ఆలయ భూములు, విరాళాలు, అభివృద్ధి ఖర్చులపై పూర్తి వివరాలు త్వరలో వెలువడనున్నాయి.

# బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నాబిన్‌ను కలిసిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారతీయ జనతా పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల నియమితులైన శ్రీ నితిన్ నాబిన్ ని, బీజేపీ సీనియర్ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ కూడా ఆయనతో పాటు ఉన్నారు. నితిన్ నాబిన్ బీజేవైఎం జాతీయ నాయకుడిగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డితో ఏర్పడిన పాత పరిచయాలు, అనుభవాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "ఒక సామాన్య కార్యకర్త జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగగలిగే అవకాశం కల్పించే పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే. సిద్ధాంతానికి నిబద్ధంగా పనిచేసే కార్యకర్తలను గుర్తించి గౌరవించే పార్టీ బీజేపీ. నితిన్ నాబిన్ నాయకత్వంలో తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం. భవిష్యత్తు అంతా బీజేపీదే, యువతరానిదే" అని పేర్కొన్నారు.

# నూతనంగా ఎన్నికైన షాబాద్ ఉప సర్పంచ్ దండు రాహుల్ కు ఘనంగా సన్మానం

**రంగారెడ్డి జిల్లా , డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాబాద్ ఉప సర్పంచ్ గా దండు రాహుల్ ఎన్నికైన సందర్భంగా షాద్నగర్ ఆర్యవైశ్య మిత్ర బృందం ఘనంగా సన్మానంచారు. ఈ కార్యక్రమంలో



యంసాని శ్రీనివాస్, దండు రామ్మోహన్, ఉప్పల శ్రీనివాస్, పెంద్యాల జగదీశ్వర్, పెనుగోండ అశోక్, కల్వ మాణిక్యం, గుగ్గిళ్ళ రాజేష్, కట్ట ప్రవీణ్, గుబ్బ సురేష్, నంద కిషోర్, గౌరీ శంకర్, భాను రి రామ్మోహన్, మరియు, షాబాద్ కు చెందిన పబ్బ ప్రవీణ్, సాయి రామ్, గడ్డం రమేష్, గార్ల పాటి నర్సింలు, దండు రాజేష్, తదితరులు ఉన్నారు.

# కరీంనగరంలో ఒకే వేదిక పై 26 పడిపూజలు



B.P.L. రాజు గురు స్వామి, నగేష్ గురుస్వామి

**కరీంనగర్, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగరంలోని హౌసింగ్ బోర్డ్‌లో నగేష్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం 25వసారి శ్రీ అయ్యప్ప స్వామి మాలధారణ సందర్భంగా విశిష్టమైన కార్యక్రమం జరగబోతోంది. శ్రీ అయ్యప్ప స్వామికి ప్రీతిపాత్రమైన పడిపూజలు, కన్నెస్వామి పూజలు ఒకే వేదికపై, ఒకే సారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో 25 మంది కన్నెస్వాములు, ఒక ప్రధాన పడి స్వామితో కలసి మొత్తం 26 పడులు ఒకేసారి పూజలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వేద బ్రాహ్మణోతముల మంత్రోచ్చారణల మధ్య, గురుస్వాముల ఆశీర్వచనాలతో, కరీంనగరంలో ఇంతవరకు చూడని రీతిలో ఈ పూజలు జరగనున్నాయి. డిసెంబర్ 21వ తేదీ ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు హౌసింగ్ బోర్డ్‌లో ఈ మహోత్సవం ప్రారంభమవుతుంది. పూజ అనంతరం అల్పాహారం కార్యక్రమం కూడా నిర్వహించబడుతుంది. అయ్యప్ప దీక్షధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని గురుస్వామి బి.పి.ల్.రాజు పిలుపునిచ్చారు.

# ఎలిగేడు మండలంలో 12 గ్రామాల ఉప సర్పంచ్‌లు ఎన్నిక



ముంజం నరేష్ కుమార్ ఎలిగేడు ఉప సర్పంచ్

**ఎలిగేడు, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల తుది విడతలో ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో ఉప సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. బురహన్ మియాపేట్‌లో పుల్యాల మంగ, దూళికట్టలో మేచినేని అండాలు, ఎలిగేడు గ్రామంలో ముంజం నరేష్ కుమార్, లాలపల్లిలో ముత్కల రమ్య, లోకపేట్‌లో బైరి మల్లేశం, ముప్పిరిలో తోట మారం రాయమల్లు, నారాయణపల్లిలో కొత్తిరెడ్డి బాపురెడ్డి, నర్సాపూర్‌లో గోసిక రవీందర్, రాములపల్లిలో తీట్ల విద్యాలత, ర్యాకల్ దేవ్‌పల్లిలో బోడిగే శివకృష్ణ, శివపల్లిలో పొన్నాల సౌజన్య, సుల్తాన్‌పూర్‌లో తానిపర్తి రమేష్‌రావు ఉప సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

# బీజాపూర్‌లో ఎదురుకాల్పులు

**బీజాపూర్:- డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. సెక్యూర్టీ సిబ్బంది, నక్సలైట్ల మధ్య శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. బైరాంఘుర్-ఇంద్రావతి అడవి కొండల్లో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. నక్సలైట్ ఆపరేషన్ కోసం జిల్లా రిజర్వ్ గార్డు బృందం బయటకు వెళ్లిన సమయంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతంలో మావోలు తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో సెక్యూర్టీ బలగాలు అక్కడకు వెళ్లాయి. ప్రస్తుతం ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. ఎన్‌కౌంటర్‌కు చెందిన మరిన్ని విషయాలు వెల్లడి కావాల్సి ఉన్నది. సుక్మా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సల్స్ హతమయ్యారు. ఆ ముగ్గురిపై 12 లక్షల రివార్డు ఉన్నది.

# మంచిరెడ్డి కిషన్ రెడ్డిని కలిసిన నూతన సర్పంచులు






**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ప్రజాప్రతినిధులను కిషన్ రెడ్డి శాలువాలతో సన్మానించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించాలని ఆయన సూచించారు.

# 108 అంబులెన్స్ వాహనాన్ని తనిఖీ చేసిన ప్రోగ్రాం కోఆర్డినేటర్




**ఆమనగల్లు, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం 108 వాహనాన్ని పోగ్రామ్ కోఆర్డినేటర్ రాజబాబు అకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులు వాహనంలో ఉన్న మందులు, పరికరాల తీరును పరిశీలించారు. అనంతరం ఈఎంటీ కళ్యాణ్, పైలట్ చంద్రశేఖర్ ను వాహనం సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులు, రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని రాజబాబు సూచించారు.

# కాంగ్రెస్ తో సొంతింటి కల సాధ్యం



**ఆమనగల్లు, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్తో సాధ్యమని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర నాయకులు కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు ప్రతిభ నగర్ కాలనీలో కమిషనర్ శంకర్ నాయక్ తో కలిసి మంజూరు పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు సొంతిల్లు ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# పొగమంచు గుప్పిట్లో ఉత్తరాది!..

**-ఢిల్లీలో 152 విమానాల రద్దు**

**న్యూఢిల్లీ డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఢిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలను దట్టమైన పొగ మంచు కమ్మేయడంతో శుక్రవారం దాదాపు 152 విమానాలు రద్దయ్యాయి. దట్టమైన పొగమంచు కారణంగా ఏమీ కనిపించని స్థితి ఏర్పడిందని, రద్దు చేసిన 152 విమాన సర్వీసులలో 79 నిష్క్రమణ, 13 ఆగమన విమానాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. కాలుష్య తీవ్రత ఆధారంగా మూడు పరిస్థితులలో పనిచేస్తున్న ఢిల్లీ విమానాశ్రయంలో జాప్యాలు, అవాంతరాలు ఏర్పడుతున్నట్లు వారు చెప్పారు. తమ విమానాల స్టేటస్ గురించి సంబంధిత ఎయిర్‌లైన్స్‌ని అడిగి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ప్రయాణికులకు ఎక్స్ పోస్టులో ఢిల్లీ ఎయిర్‌పోర్టు సూచించింది.

# సచివాలయ ముట్టడిని విజయవంతం చేద్దాం

**బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండే కార్ యాదిలాల్**




**ఆమనగల్లు, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
న్యాయవాదుల రక్షణ చట్టం కోసం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండే కార్ యాదిలాల్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ఈనెల 22న పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు . ఆమనగల్లు కోర్టు ఆవరణలో శుక్రవారం సచివాలయం ముట్టడి, పాదయాత్ర విజయవంతం పై బార్ అసోసియేషన్ సభ్యులు సన్నాహక సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాదయాత్ర విజయవంతం పై చర్చించారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం రూపకల్పన ప్రభుత్వం పై ఒత్తిడికి పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగు ప్రధాన డిమాండ్లతో సచివాలయం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలని, 41 ఏ పిఆర్ పిసి చట్టం సవరించాలని, న్యాయవాదులకు ఆరోగ్య భీమా రూ .2 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకురూ. 10 వేలు స్టైఫండ్ ఇవ్వాలని యాది లాల్ కోరారు. 22న ఉదయం 10 గంటలకు ఆమనగల్లు కోర్టు ఆవరణలో పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్రలో పలు బారాసోసియేషన్ల సభ్యులు, న్యాయవాదులు పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటిరోజు కందుకూరు వరకు పాదయాత్ర కొనసాగుతుందని, రెండవ రోజు తుక్కుగూడ వరకు, మూడవరోజు సచివాలయం వరకు పాదయాత్ర ఉంటుందని వివరించారు. న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సన్నాహక సమావేశంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి దుడ్డ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ,సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి కొప్పు కృష్ణ, గ్రంథాలయ సెక్రటరీ పసుపుల మల్లేష్,క్రీడా కార్యదర్శి శేఖర్, సభ్యులు సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేపల్లి జగన్, మల్లేష్,మధు గౌడ్, గణేష్ గౌడ్, జగన్ గౌడ్, సంతోష్,దేవేందర్,శివ శంకర్,మహేశ్వర్, మహేష్, బిక్యనాయక్, సర్దార్ నాయక్. శ్రీనివాస్, శిరీష్, శ్రీశైలం, రమేష్, నరేందర్, రామచందర్, మహేష్, తదితరులు ఉన్నారు.

# హజరత్ నిరంజన్ షావలి దర్గా కమిటీ ఎన్నిక



**అమ్రాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే హజరత్ నిరంజన్ షావలి గందోత్సవం సందర్భంగా రంగాపూర్‌లో 121వ గందోత్సవ కమిటీ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. మసీద్ కమిటీ అధ్యక్షులు గులాం దస్తగీర్ ఆధ్వర్యంలో కమిటీ పెద్దలు, స్థానిక యువకుల సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. జనవరి 17న రంగాపూర్‌లో జరగనున్న ఉర్సు జాతర కార్యక్రమానికి సంబంధించి ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో తొమ్మిదోసారి అధ్యక్షుడిగా మహమ్మద్ ఇస్మాయిల్ అలీ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎండి ఖదీర్, ఎండి పర్వేస్, కార్యదర్శిగా ఎండి ఇలియాస్, ఉప కార్యదర్శులుగా ఎండి జూనిద్, ఎండి సాజిద్, ఎండి రహీం, ట్రెజరర్‌గా అఫ్జల్, ఎండి సజాద్ అలీతో పాటు మరో 15 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు టాప్ప అక్బాల్, ఫయాజ్ ఖాన్, షేక్ బిక్కాన్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మగిరి ఉప సర్పంచ్ కాజా మోయిస్ కు ఘన సన్మానం



**అమ్రాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలం బ్రహ్మగిరి గ్రామ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన కాజా మోయిస్‌ను, సర్పంచ్ ఉడుతల మల్లేష్‌తో కలిసి ఈరోజు ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అచ్చంపేట ముస్లిం మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అచ్చంపేట ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆశీర్వాదంతో ఘన విజయం సాధించిన కాజా మోయిస్‌కు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ నాయకులు, రంగాపూర్ దర్గా కమిటీ చైర్మన్ రఫీ, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ అలీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నిజాముద్దీన్, ఐఎన్టీయూసీ టౌన్ అధ్యక్షులు గౌస్ పాషా, కౌన్సిలర్ మోయిస్, ఐఎన్టీయూసీ మండల ఉపాధ్యక్షులు మౌలానా, కౌన్సిలర్ బాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షాపోదీన్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కిడ్జీ

**-మౌంట్ లిటెరా జీ స్కూల్ విద్యార్థుల ఘన విజయం**



**దేవరకొండ,డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ కిడ్జీ మరియు మౌంట్ లిటెరా జీ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చారు. ఈ నెల డిసెంబర్ 14న హైదరాబాద్‌లోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా వందలాది మంది పోటీపడగా, పాఠశాల నుంచి పాల్గొన్న ఏడుగురు విద్యార్థులు విశేష విజయాన్ని నమోదు చేశారు. ఈ పోటీల్లో ఐదుగురు విద్యార్థులు స్వర్ణ పతకాలు, ఒక విద్యార్థి రజత పతకం, మరో విద్యార్థి కాంస్య పతకం సాధించారు. వారి ఈ ఘనత విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనకు నిదర్శనంగా నిలిచింది. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ అష్రఫ్ అచారత్ అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరాటే వంటి యుద్ధకళలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అలాగేవిద్యార్థులను ఛాంపియన్లుగా తీర్చిదిద్దిన కరాటే మాస్టర్ గోపి నాయక్ అంకితభావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల విజయాన్ని హర్షాతిరేకంగా అభినందించారు.

# ప్రపంచమంతా ఐక్యంగా జరుపుకునే పండుగ క్రిస్మస్



**నల్లగొండ, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రపంచమంతా ఐక్యమత్యంగా జరుపుకునే గొప్ప పండుగ క్రిస్మస్ అని యూనివర్సల్ చర్చి వ్యవస్థాపకుడు రెవరెండ్ ఎం రవి కుమార్, మచిలీపట్నం కు చెందిన షారాజ్యోతి గ్రేస్ పార్ల అన్నారు. గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ సందర్భంగా పట్టణంలోని శాంతినగర్ సువార్త నిలయంలో జరిగిన గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్ లో పాల్గొని కేక్ కట్ చేసి వాక్య సందేశాన్ని అందించారు. అనంతరం నల్లగొండ నియోజకవర్గంలోని వందమంది వితంతువుల కు క్రిస్మస్ కానుకగా చీరలు అందించారు. అనంతరం క్రిస్మస్ గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో యూనివర్సల్ చర్చి సంఘ పెద్దలు సిహెచ్ ప్రభాకర్,ఎం రాములు, దుబ్బా అనిల్,,నరేష్,జీవన్, విజయ్ కుమార్, సండే స్కూల్ విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు

# సింగారం గ్రామ సర్పంచి నీలం శేఖర్ యాదవ్ కు ఘన సత్కారం

**అచ్చంపేట,డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లో ని సింగారం గ్రామ సర్పంచ్ గా కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి నీలం శేఖర్ యాదవ్ తన ప్రత్యర్థి పై 124 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.గ్రామ పంచాయతీ లోని8 వార్డులు ఉండగా అన్ని వార్డులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. శేఖర్ నుగ్రామ సర్పంచ్ గా గెలుపొందిన సందర్భంగా అచ్చంపేట శాసనసభ్యులు డా. వంశీకృష్ణ శుక్రవారం నాడు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శేఖరు పార్టీలో చురుకైన కార్యకర్తగా ఉండి గ్రామ ప్రజలకు ఏ సమస్యలు ఉన్న ముందుండి చూసుకునేవాడని



అదేవిధంగా గ్రామ అభివృద్ధి కోసం పాటుపడే కార్యకర్తగా పనిచేసేవాడు కాబట్టి గ్రామ ప్రజలు ఈ యొక్క గొప్ప సువర్ణ అవకాశాన్ని కల్పించారని కొనియాడారు.అనంతరం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ నాకు ఇంతటి అవకాశాన్ని ఇచ్చిన మా రాజకీయ గురువు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నా వంతు పాత్ర పోషిస్తానని ,నాకు ఇంతటి ఘనవిజయాన్ని అందించిన గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ రామనాథం, ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి ని కలిసిన నూతన సర్పంచ్ లు










**యాచారం డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : గ్రామాలు అభివృద్దె ధ్యేయంగా సర్పంచ్ లు పని చేయాలి అని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. నూతనంగా విజయం సాధించిన వివిధ గ్రామాల కాంగ్రెస్ సర్పంచ్ లు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ని తొర్రర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదకపూర్వకంగా కలిశారు. ఈ సంధ్బంగా ఎమ్మెల్యే రంగారెడ్డి నూతన గా ఎన్నికైన సర్పంచ్ లు, వార్డు మెంబర్ లకు శాలువలతో సన్మానిచ్చారు. ఈ సందర్బంగా గ్రామ సర్పంచ్




లు గ్రామాల అభివృద్దె ధ్యేయంగా పని చేయాలనీ సూచించారు. గ్రామాలకు కావాల్సిన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన యాచారం మండలం మేడిపల్లి సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ , మంతన్ గౌరెల్లి సర్పంచ్ కొర్ర అరవింద్ నాయక్ ,గున్ గల్ , బి. బుచ్చి రెడ్డి, , కొత్తపల్లి చిక్కుడు వెన్నెల, తక్కళ్లపల్లి ఎం. నరేందర్ రెడ్డి, తమ్మలోని గూడ దెంది రాంరెడ్డి , వివిధ గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు.... మరియు మేడిపల్లి మాజీ సర్పంచ్ లు లిక్కీ నిర్మల మాజీ ఎంపీటీసీ మోటే శ్రీశైలం , మరియు మాజీ వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారుజ

# యూరియా పంపిణీకి కొత్త మొబైల్ యాప్



**మాడుగుల, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మాడుగుల రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం కొత్త మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి శుక్రవారం ప్రకటించారు.రైతులు ఇకపై గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకోవచ్చని ఆమె తెలిపారు. యాప్‌లో రైతులు, అధికారులు, డీలర్ల కోసం వేర్వేరు లాగిన్ ఆప్షన్లు ఉండగా, రైతులు తమ మొబైల్ నంబరు, ఓటీపీ ద్వారా లాగిన్ కావచ్చని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న యూరియా స్టాక్ వివరాలు యాప్ ద్వారా నేరుగా తెలుసుకోవచ్చని చెప్పారు. రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం నంబరు, సాగు చేస్తున్న పంట వివరాలు, విస్తీర్ణం నమోదు చేసి యూరియాను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. సొంత భూమి లేని కౌలు రైతులు కూడా ఆధార్ నంబరు, భూ యజమాని ధృవీకరణ ఓటీపీ ద్వారా యూరియా బుక్ చేసుకునే అవకాశం కల్పించబడిందని వెల్లడించారు.ఈ యాప్‌ను డిసెంబర్ 22 నుంచి ప్రయోగాత్మకంగా ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులకు యూరియా మొబైల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించిన వ్యవసాయ విస్తరణ అధికారి రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

## మహేశ్వరం సర్పంచ్ నవీన్‌ను అభినందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




**మహేశ్వరం, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం గ్రామ సర్పంచ్‌గా ఘన విజయం సాధించిన మునగపాటి నవీన్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శాలువాలతో సత్కరించి హృదయపూర్వకంగా అభినందించారు.ఈ సందరరేగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, గ్రామాభివ ృద్ధి కోసం ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నమస్కారాలు తెలుపుతూ ధన్యవాదాలు తెలిపారు. మహేశ్వరం గ్రామ అభివ ృద్ధి విషయంలో ఎక్కడా వెనకడుగు వేయబోనని, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రోళ్ల చంద్రయ్య, ఆనందం, సుధీర్ గౌడ్, మినాస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు..

# ఆమనగల్లులో డ్రోన్ల కలకలం

- అనుమతి లేకుండా డ్రోన్ సర్వే
- సాకిబండ తండాలో గిరిజనుల ఆగ్రహం

**ఆమనగల్లు, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండా గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు భూసేకరణ పేరుతో ఎల్ అండ్ టీ కంపెనీకి చెందిన కాంట్రాక్టర్ యాజమాన్యం అక్రమంగా వ్యవహరించిందని గిరిజన రైతులు, మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి అనుమతి లేకుండా, గ్రామ ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా దొంగదారిన వచ్చిన సర్వే బృందం డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ పొలాల్లో పనులు చేపట్టిందని ఆరోపించారు.పొలాల్లో పనిచేస్తున్న మహిళలపై డ్రోన్ కెమెరాతో వీడియోలు తీయడంతో వారు భయభ్రాంతులకు గురయ్యారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన గిరిజన మహిళలు, రైతులు సర్వే బృందాన్ని అడ్డుకొని, అనుమతి లేకుండా డ్రోన్ ఎలా ఆపరేట్ చేస్తున్నారంటూ నిలదీశారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.గిరిజనులకు ఇబ్బందులు కలిగించిన ఎల్ అండ్ టీ కంపెనీతో పాటు సంబంధిత సర్వే బృందంపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ మహిళలు, రైతులు డిమాండ్ చేశారు.



గిరిజనులపై జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమనగల్ పోలీసులను కోరారు.ఈ వ్యవహారంపై రంగా రెడ్డి జిల్లా కలెక్టర్, ల్యాండ్ అక్విజిషన్ అధికారి డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆమనగల్ మండల తహసీల్దార్‌లను సంప్రదించగా, సదరు సర్వేకు తమ అనుమతి లేదని, తాము ఎవరినీ సర్వేకు పంపలేదని వారు స్పష్టం చేసినట్టు గ్రామస్తులు తెలిపారు.ఎవరి అనుమతి లేకుండా, ఊరి ప్రజల సమ్మతి లేకుండా డ్రోన్‌లతో వీడియోలు తీసి గిరిజనులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై తప్పకుండా కేసులు నమోదు



చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సాకిబండ తండా గిరిజన రైతులు మరోసారి డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతమైతే గ్రామ రైతులు ఊరుకునేది లేదని హెచ్చరించారు.ప్రభుత్వం గిరిజనులకు తగిన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే సర్వేలు చేపడతామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పుడు కాంట్రాక్టర్ల ద్వారా అనుమతి లేకుండా సర్వేలు నిర్వహించడం అన్యాయమని గిరిజన రైతులు మండిపడ్డారు. గిరిజనుల హక్కులను కాలరాస్తూ జరుగుతున్న ఈ చర్యలను ఏమాత్రం సహించబోమని వారు స్పష్టంగా ప్రకటించారు.

# భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



**యాచారం డిసెంబర్ ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**

స్వామి అయ్యప్ప.. శరణం అయ్యప్ప..మణికంఠ మందారం.. గురుస్వాములు బంగారం అంటూ కరిమళవాసుడు అయ్యప్ప స్వామిని కొలుస్తూ యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలో అయ్యప్ప స్వామి సన్నిధాన మహాపడి పూజామహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ మహపడిపూజ మహోత్స వానికి పెద్దఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# వేర్వేరు పార్టీల నుంచి సర్పంచులుగా ఎన్నికైన అన్నచెల్లెళ్లు



**మహేశ్వరం, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ఒకే కుటుంబానికి చెందిన అన్నచెల్లెళ్లు సర్పంచులుగా ఎన్నికై అరుదైన ఘనత సాధించారు. మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామం నుంచి చేపంగి ప్రవీణ్ కాంగ్రెస్ మద్దతుతో సర్పంచ్‌గా విజయం సాధించగా, ఆయన సోదరి జెన్నపల్లి పద్మ మాణిక్యమ్మగూడ గ్రామంలో బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్‌గా గెలుపొందారు. పార్టీలు వేరైనా అన్నచెల్లెళు ఇద్దరూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఇచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. రాజకీయ భేదాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధే లక్ష్యంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అభినందనలు తెలియజేశారు.

# ఎమ్మెల్యేను కలసిన నారాయణపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం.



**ఎలిగేడు, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

మండలంలోని నారాయణపల్లి నూతన గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు శుక్రవారం పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ను శివపల్లి లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే వారిని అభినందించి గ్రామ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని అందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగు లత శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ కొత్తిరెడ్డి బాపురెడ్డి, వార్డు సభ్యులతో పాటు ఎలిగేడు సింగిల్ విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ కరివేద సుధాకర్ రెడ్డి, ఎలిగేడు మాజీ ఉప సర్పంచ్ గుడుగుల మహేందర్, కాంగ్రెస్ నాయకులు కొత్తి రెడ్డి శరత్ రెడ్డి, కాసర్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


# నితీశ్ కుమార్‌కు భద్రత పెంపు

**న్యూఢిల్లీ-డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఇటీవల మహిళా డాక్టర్ హిజాబ్ లాగి విమర్శలు ఎదుర్కొంటున్న బిహార్ సీఎం నితీశ్‌కు భద్రత పెంచారు. బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేయాలని నిఘా సంస్థలు సూచించాయని అధికారులు తెలిపారు. నితీశ్‌కు స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ కఠినమైన భద్రతావలయాన్ని విధించినట్లు చెప్పారు. పరిమిత సంఖ్యలో ఉన్నతస్థాయి వ్యక్తులనే అనుమతిస్తున్నట్లు తెలిపారు. అటు రాష్ట్రంలోని సున్నితమైన ప్రాంతాల్లోనూ నిఘా పెంచారు.

# అమవాస్య అన్నప్రసాద వితరణ







**మహబూబ్ నగర్ , డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఎంతో ప్రీతికరమైనది ఈ అమావాస్య ప్రత్యేకమైనది... సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశిస్తున్నందుకు ధనుర్మాసం ఏర్పడినది అని నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. మార్గశిర మాసం,కృష్ణ పక్షం,శుక్రవారం రోజు అమావాస్య రోజు అన్నప్రసాదమును అందించిన నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్, ఎన్నో అవార్డులు అందుకున్న ,మహబూబ్ నగర్ రాజేంద్రనగర్ నివాసి. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.... ఈ మాసం శ్రీ మహావిష్ణువుకు ఎంతో పవిత్రమైనది ఈ మాసంలో అన్నసంతర్పణ చేయడం ఎంతో శ్రేష్ఠం. అదేవిదంగా ప్రతిరోజుకు ఏదోఒక విశిష్టత అనేది ఉంటుంది.అదేవిదంగా మన నిత్యజీవితములో ప్రతిఒక్కరికి ఆహారం అనేది తప్పనిసరి. దయచేసి మనము వెళ్లేదారిలో ఎవరైనా సరే ఆకలితో ఉంటే వారికి ఏదోఒకటి అందించి ఆకలిని తీర్చగలరు. అదేవిదంగా ఈరోజు అమావాస్య సందర్భంగా రహదారుల వెంబడి వున్న వృద్దులకు మరియు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వున్న కొందరికి మా అమ్మగారు "వాసవి స్త్రీ శక్తి పురస్కార"గ్రహీత నిచ్చనమెట్ల వరలక్ష్మి వండిన ఆహారంను అందించి కాసింత ఆకలిని తీర్చడం జరిగింది అని అన్నారు. మనము ఎంత సంపద సంపాదించినా సమాజములో ఒక గుర్తింపు కోసం మాత్రమే. మనము చేసిన స్వచ్ఛంద సేవలు కాని, మంచి చెడులు అనేవి ఎప్పటికి అలానే వుంటాయని రాజేంద్రప్రసాద్ అన్నారు.

# నూతనంగా ఎన్నికైన సర్పంచులను సన్మానించిన అందెలా

-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆశీస్సులతో....
చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం
- శ్రీరాములు అందెల

**బాలాపూర్,డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో ఇటీవల జరిగినటువంటి సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ సర్పంచ్ అభ్యర్థులు తమ వార్డు మెంబర్లతో కలిసి మండల అధ్యక్షులు నిమ్మ అంజి రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు నియోజకవర్గ బిజెపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ




సందర్భంగా నూతనంగా ఎన్నికైనటువంటి సర్పంచ్ మరియు పాలకవర్గాన్ని శ్రీరాములు ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీరాములు గారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆశీస్సులతో అదే విధంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి వరకు చేరేలా కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు సూచించారు. రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లోను ఇదే సత్తాను కొనసాగించి భారతీయ జనతా పార్టీకి అఖండ మెజారిటీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్ రెడ్డి , అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గానుగుపేట అంజమ్మ, ఆకులమైలారం సర్పంచ్ ఏ నరేష్, బేగంపేట్ సర్పంచ్ జాపాల పూజా హరిబాబు, దాసర్లపల్లి సర్పంచ్ టేకుమట్ల బాలరాజు, ఆకులమైలారం ఉప సర్పంచ్ అచ్చన్న సురేష్, వార్డు మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, బీజేవైఎం నాయకులు మరియు వివిధ గ్రామస్తులు పాల్గొన్నారు.

# గాంధీ పేరును దేశప్రజల నుంచి వేరు చేసే కుట్ర

**-యూపీఏ హయాంలో ఉపాధి హామీ పథకం పక్కాగా అమలు**
**-సోనియా, రాహుల్ ను వేధిస్తున్న మోడీ సర్కార్: కేఎల్ఆర్**

**మహేశ్వరం,డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడలో కేఎల్ఆర్ మాట్లాడుతూ...జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించటం చరిత్రను కాలరాయటమేనని మండిపడ్డారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి. ప్రతిపక్షాలు, ప్రజల అభిప్రాయాలకు విలువ లేకుండా... చట్టసభ సభ్యుల హక్కులను కాలరాస్తూ... బిల్లుకు ఆమోదం తెలపటం బీజేపీ నిరంకుశ పాలనకు నిదర్శనమని కేఎల్ఆర్



అన్నారు. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) పథకాన్ని బలవంతంగా దేశ ప్రజలు, ఉపాధి హామీ కూలీలపై రుద్దటమేనని కిచ్చెన్న బీజేపీపై మండిపడ్డారు. జాతిపిత పేరును భారతీయుల మనసుల నుంచి వేరు చేసే కుట్రకు ఎన్డీఏ ప్రభుత్వం చేస్తుందని లక్ష్మారెడ్డి విమర్శించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబంపై బీజేపీ కేంద్ర సర్కార్, మోడీ కక్ష సాధింపునకు నేషనల్ హెరాల్డ్ కేసే నిదర్శనమని కిచ్చెన్న మండిపడ్డారు. సోనియాగాంధీజీ, రాహుల్ గాంధీజీలపై ఈడీ వేసిన ఛార్జిషీట్ ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసిందని... న్యాయస్థానంలో సత్యమే గెలిచిందని లక్ష్మారెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ... రాజ్యాంగ సంస్థలను పావులుగా కేంద్ర సర్కార్ వాడుకుంటుందని కేఎల్ఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాబోయే ఎన్నికల్లో సిపిఐకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

**మహబూబాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మహబూబాబాద్‌లో సిపిఐ జనరల్ బాడీ సమావేశం స్థానిక వీరభవన్‌లో జరిగింది. సమావేశానికి హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారధి మాట్లాడుతూ రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు. 2014 విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు పరిశ్రమను వెంటనే ప్రారంభించేందుకు బిజెపి కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ ఎల్లప్పుడూ ప్రజల కోసం ఉద్యమిస్తుందని, గ్రామాభివృద్ధి కోసం ఎర్రజెండా అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు, శ్రేణులు, గ్రామ కార్యదర్శులు, గెలిచిన వార్డు సభ్యులు పాల్గొన్నారు.





# విప్లవోద్యమానికి ప్రాణం పోసిన వీరుల 98వ వర్ధంతి



**మానుకోట, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్వాతంత్ర్య సమరయోధులు, హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పండిట్ రామ్ ప్రసాద్ బిస్మిల్, అశ్ఫాఖుల్లా ఖాన్‌ల 98వ వర్ధంతిని శుక్రవారం మానుకోట పట్టణంలోని కంకరబోడ్ కాలనీ, భీం సాగర్ హాస్పిటల్ ఎదురుగా నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అశ్ఫాఖులా ఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందరరేగా నేతాజీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కందుల నాగరాజు మాట్లాడుతూ "దేశ సంపదను బ్రిటిష్ పాలకులు తమ దేశానికి అక్రమంగా తరలిస్తున్నారనే విషయం తెలుసుకున్న విప్లవ వీరులు అశ్ఫాఖులా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర్ ఆజాద్, భగవతి చరణ్ వోహ్రా తదితరులు కలిసి కాకోరి వద్ద రైలును ఆపి ప్రభుత్వ ఖజానాను స్వాధీనం చేసుకున్నారు. ఆ సంపదను విప్లవోద్యమానికి, పేద ప్రజల సంక్షేమానికి వినియోగించారు. చివరికి బ్రిటిష్ కుట్రలతో వీరులను పట్టుకొని ఉరిశిక్ష విధించారు. వీరి త్యాగం భారతీయ యువతకు చిరస్థాయిగా ప్రేరణగా నిలుస్తుంది" అని అన్నారు. షేక్ యూసుఫ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో రామ్ ప్రసాద్ బిస్మిల్, అశ్ఫాఖులా ఖాన్‌ల పాత్ర అమోఘమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి ఉప కార్యదర్శి కుర్యావుల గంగాధర్ గౌడ్, ఆర్గనైజింగ్ కన్వీనర్ సామ శ్రీనివాస్, ఇస్మాయిల్ నాయక్, ఇమ్రాన్, ఫజల్, ఇమామ్, త్రినాథ్, ఇబ్రహీం, శంశు, అలీం పాషా, రమేష్, సలీం, యాదగిరి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ




**మహబూబాబాద్, డిసెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని ఆకర్షణీయమైన ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఆయన హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలకు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదని, ఎలాంటి పోలీసు అధికారి వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరని స్పష్టం చేశారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్స్, వెబ్‌సైట్లు, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ లింకుల ద్వారా మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ లేదా లింకులు ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు తిరుపతి రావు, కృష్ణకిషోర్, గంద్రాతి మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'అలాంటి ఒప్పందమేదీ జరగలేదు'..

**-సీఎం పదవిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య..!**



**న్యూఢిల్లీ డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కర్ణాటక లో సీఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందని, డీకే శివకుమార్ సీఎం అవుతారని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా.. సీఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సీఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు. 'నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సీఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సీఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి. గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సీఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

# బంగ్లాదేశ్ పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి జోక్యం అవసరం



**మహబూబాబాద్, డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు డిమాండ్ చేశారు. తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనుస్ నియంత్రణలో పరిస్థితులు చేజారిపోయాయని, ప్రత్యేక కోటా వ్యతిరేక ఉద్యమ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాది హత్యతో దేశం అట్టుడికిపోయిందని ఆయన పేర్కొన్నారు. షేక్ ముజిబుర్ రెహ్మాన్ ఇంటిని కూల్చివేయడం, షేక్ హసీనా దిష్టిబొమ్మలను దహనం చేయడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమని అన్నారు. భారతీయులు, రాయబార కార్యాలయాలపై దాడులు అమానుషమని ఖండించిన ఆయన, జర్నలిస్టుల హత్యలు, పత్రికా కార్యాలయాల దహనం బంగ్లాదేశ్ అభివృద్ధిని దహనం చేస్తున్నాయని వాపోయారు. అమెరికా, చైనా కుట్రలతో ఈ పరిస్థితులు మరింత విషమిస్తున్నాయని ఆరోపించారు. ప్రపంచ దేశాలు ఈ హింసాత్మక ఘటనలపై దృష్టి సారించాలని, కేంద్ర ప్రభుత్వం కూడా పొరుగు దేశ పరిణామాలు మనకు ముప్పుగా మారకముందే తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే ఫిబ్రవరి ఎన్నికలకు ముందు బంగ్లాదేశ్‌లో శాంతి స్థాపన అవసరమని ఆకాంక్షించారు.

# తమిళనాడులో 97 లక్షల ఓట్ల తొలగింపు..


- **ముసాయిదా జాబితా విడుదల**
- **బీహార్ చిట్కా ఇక్కడ వాడారని 'సర్' ప్రక్రియపై డీఎంకే ఆగ్రహం**



**న్యూఢిల్లీ డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాలను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. సర్ తర్వాత డీఎంకే పాలిత తమిళనాడులో 97 లక్షలకు పైగా ఓటర్లను తొలగించినట్టు, అందులో ఒక్క చెన్నైలోనే 14.25 లక్షల ఓట్లు ఉన్నట్టు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ అర్చనా పట్నాయక్ శుక్రవారం వెల్లడించారు. సర్ తర్వాత తమిళనాడులో ఓటర్ల సంఖ్య 5,43,76,755గా ఉందని ఆమె వివరించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 6.41 కోట్లని చెప్పారు. పాత జాబితాలోని 97,37,832 ఓటర్ల పేర్లను తొలగించామన్నారు. ఇందులో 26.94 లక్షల మంది మరణించగా, 66.44 లక్షల మంది శాశ్వతంగా వలస లేదా వేరే ప్రాంతానికి వెళ్లిపోయారని, 3,39,278 ఓట్లు డూప్లికేట్ ఎంట్రీలు ఉన్నాయన్నారు. సర్ అనంతరం ఈసీ విడుదల చేసిన ముసాయిదా జాబితాపై అధికార డీఎంకే ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతకు ముందు బీహార్ రాష్ట్రంలో కూడా కేంద్రం ఇదే చిట్కాను ప్రయోగించి లక్షలాది మంది నిజమైన ఓటర్లను తొలగించిందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించారు.

**గుజరాత్‌లో 74 లక్షల మంది**
బీజేపీ పాలిత గుజరాత్‌లో సర్ ప్రక్రియ ముగిసిన తర్వాత 74 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే మధ్యప్రదేశ్‌లో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 42 లక్షల మంది ఓటర్లను తొలగించారు. దీంట్లో 22.5 లక్షల మంది వివిధ ప్రాంతాలకు తరలిపోగా, 8.4 లక్షల మంది మరణించారు. 2.5 లక్షల మందికి రెండు చోట్లా ఓట్లు ఉన్నాయి. 8.4 లక్షల మంది ఆబ్సెంట్ ఓటర్లు ఉన్నారు.

# గ్రీన్ కార్డు లాటరీ ప్రోగ్రామ్‌ను సస్పెండ్ చేసిన ట్రంప్



**న్యూయార్క్ డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమెరికా గ్రీన్ కార్డు లాటరీ ప్రోగ్రామ్ ను తాత్కాలికంగా రద్దు చేశారు. తాజాగా బ్రౌన్ యూనివర్సిటీలో కాల్పుల ఘటనకు పాల్పడిన వ్యక్తి ఆ లాటరీ పద్ధతిలోనే అమెరికాలోకి ఎంటర్ అయినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ పద్ధతిని సస్పెండ్ చేస్తూ ట్రంప్ ఆదేశాలు ఇచ్చారు. వివిధ దేశాలకు చెందిన సుమారు 50 వేల మందికి లాటరీ పద్ధతిలో గ్రీన్ కార్డు జారీ చేస్తుంటారు. ట్రంప్ ఆదేశాల ప్రకారం గ్రీన్ కార్డు లాటరీ వ్యవస్థను తాత్కాలికంగా రద్దు చేయాలని అమెరికా పౌరసత్వ, ఇమ్మిగ్రేషన్ సర్వీసు శాఖకు లేఖ పంపినట్లు హోంశాఖ మంత్రి క్రిస్టిన్ నియోమ్ తన ఎక్స్ పోస్టులో తెలిపారు. పోర్చుగీసు జాతీయుడైన క్లాడియో నీవస్ వాలెంటిన్ .. ఇటీవల బ్రౌన్ వర్సిటీలో కాల్పులకు పాల్పడ్డాడు. ఆ కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు మరణించగా, 9 మంది గాయపడ్డారు. ఎంఐటీ ప్రొఫెసర్ కూడా హతమయ్యాడు. 2017లో నీవస్‌కు పర్మినెంట్ రెసిడెన్సీ వచ్చింది.

# మహిళా షూటర్‌పై అత్యాచారం..

**ఫరీదాబాద్‌లో ముగ్గురు అరెస్టు**




**న్యూఢిల్లీ డిసెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఫరీదాబాద్‌లో 23 ఏళ్ల మహిళా షూటర్ తన హోటల్ రూంలో అత్యాచారానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ షూటర్ స్నేహితురాలిని కూడా అరెస్టు చేశారు. బాధిత మహిళ నిందితులను హోటల్ రూమ్‌లో లాక్ చేసింది. డిసెంబర్ 17వ తేదీన ఈ ఘటన జరిగింది. పోలీసులను ఆమె అప్రమత్తం చేసింది. బివానీకి చెందిన యువ షూటర్ ఫరీదాబాద్ హోటల్‌లో రేప్‌కు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో బాధిత షూటర్‌కు చెందిన స్నేహితురాలైన మరో మహిళా షూటర్‌తో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. సూరజ్‌కుండ్‌లోని కర్ని స్టేడియంలో జరుగుతున్న షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు బాధితురాలు ఫరీదాబాద్ వెళ్లింది. బాధిత మహిళా షూటర్‌తో ఆ టోర్నీలో పాల్గొనేందుకు రాజస్థాన్‌లోని జున్‌జున్‌కు చెందిన 26 ఏళ్ల మహిళా షూటర్ వచ్చింది. అయితే గురువారం షూటింగ్ పోటీలు ముగిసిన తర్వాత ఖ్వాజా సరాయిలోని హోటల్‌లో ఉండాలని బాధితురాలిని ఆమె స్నేహితురాలు అడిగింది. బాధిత వ్యక్తికి చెందిన స్నేహితురాలి బాయ్‌ఫ్రెండ్ ఫరీదాబాద్ హోటల్‌లో రెండు రూమ్‌లు బుక్ చేశాడు. అయితే ఆ వ్యక్తి తనతో పాటు హోటల్‌కు మరో వ్యక్తిని తీసుకువచ్చాడు. ఆ ముగ్గురు కలిసి మద్యం సేవించేలా తనపై వత్తిడి తెచ్చినట్లు బాధితురాలు పేర్కొన్నది. ఆ తర్వాత ఓ వ్యక్తి ఉన్న రూమ్‌కు తనను పంపినట్లు బాధిత మహిళా షూటర్ ఆరోపించింది. ఆ సమయంలో అతను రేప్ చేసినట్లు బాధితురాలు పోలీసులకు చెప్పింది. ముగ్గురు అనుమానితులను రూమ్‌లో బంధించిన బాధితురాలు ఆ తర్వాత ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసింది. హోటల్‌కు చేరుకున్న ఎమర్జెన్సీ సిబ్బంది ఆ ముగ్గుర్నీ నిర్బంధించాకె. బాధితురాలి శరీరంపై గాయాలు ఉన్నట్లు పోలీసులు తేల్చారు.